


డీఆర్వో గంగాధర్ గౌడ్ బదిలీ

కడప కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌ను బదిలీచేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లుగా డీఆర్వోగా పనిచేస్తున్న ఆయనను బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలోకి ఏపీ సీఆర్డీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.విశ్వేశ్వరనాయుడను నియమించారు.




వైఎస్ జగన్ ఒక్కచాన్స్ అంటూ బతిమలాడటంతో.. రాష్ట్ర ప్రజలంతా వైసీపీకి ఓట్లేసి సీఎంను చేశారు. ఆయన అధికారం చేపట్టగానే రివర్స్ పాలన మొదలు పెట్టారు. వింత వింత నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశారు. రైతులను మరింత మనోవేదనకు గురి చేశారు. జగనన్న భూరక్ష పేరిట చేపట్టిన భూసర్వేలో వింతలు విచిత్రాలు జరిగాయి. భూరక్ష కాస్త భూకక్షగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక సర్వేనెంబరులో 10 ఎకరాలు ఉన్న పొలాన్ని ఎప్పుడో భాగ పరిష్కారాలు చేసుకుని ఎవరి పొలం వారు చేసుకుంటున్నారు. ఆ మేరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆన్‌లైన్ చేయించుకున్నారు. అయితే భూసర్వే చేశాక.. పదెకరాల పొలాన్ని ఒకరి పేరుతోనే జగనన్న భూరక్ష పత్రంలో నమోదు చేశారు. దీంతో ఎప్పటినుంచో తమ పేర్లతో ఉండి పంటలు చేసుకుంటున్న రైతులు లబోదిబోమంటున్నారు.

6

- వైసీపీ హయాంలో భూసర్వేతో గందరగోళం
- తరాలుగా సాగు చేసుకుంటున్న భూమి ఆన్‌లైన్‌లో తొలగింపు
- బ్యాంకు అప్పులు రెన్యువల్ చేసుకోలేక రైతుల అవస్థలు
- ఇళ్ల చుట్టూ తిరుగుతున్న బ్యాంకు అధికారులు
- రెవెన్యూ గ్రామసభలతో సమస్య పరిష్కారం అయ్యేనా..?

జగనన్న భూకక్ష..!



బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగనన్న భూరక్ష పేరిట భూముల రీసర్వే చేపట్టారు. జిల్లాలో 736 గ్రామ పంచాయతీలకు గాను అప్పట్లో 283 గ్రామాల్లో దాదాపు 1.40 లక్షల ఎకరాల భూముల రీసర్వే జరిగింది. ఇందులో చాలాచోట్ల రీసర్వే సరిగా చేయలేదంటూ రైతులు గగ్గోలు పెట్టారు. బి.కోడూరు మండలంలోని ప్రభలవీడు గ్రామ పంచాయతీ తిప్పరాజుపల్లెలో దాదాపు 700 ఎకరాలను రైతులు ఎప్పటి నుంచో సాగుచేసుకుంటున్నారు. ఈ పొలాలన్నీ ఆయా రైతుల పేరుతో ఆన్‌లైన్‌లో ఉండేవి. జగనన్న భూరక్ష సర్వే చేశాక వీటిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. అలాగే పాయలకుంట్ల గ్రామ పంచాయతీలోని కామకుంట, వేమకుంట, ఎ.కొత్తపల్లె గ్రామాల్లో దాదాపు 500 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎన్నో ఏళ్ల నాడు ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న కుటుంబాలకు భూములు ఇచ్చారు. అవి అప్పటి నుంచి వారి అనుభవంలోనే ఉన్నాయి. అలాంటి భూములను కూడా అధికారులు అడ్డగోలు సర్వే నిర్వహించి ఆన్‌లైన్ నుంచి తొలగించారు.

రెన్యువల్ కాని రుణాలు

తమ భూములను తనఖా పెట్టి వివిధ బ్యాంకుల్లో రైతులు అధికమొత్తంలో పంట రుణాలు తీసుకున్నారు. అవి సమయానికి రెన్యువల్ చేసుకోవాలి. భూములు ఆన్‌లైన్‌లో ఉంటేనే రెన్యువల్ చేస్తారు. తమ భూములు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో బ్యాంకు అధికారులు రైతుల రుణాలను రెన్యువల్ చేయడం లేదు. వర్షాలు సరిగా లేక రైతులు పంటలు సాగుచేసినా నష్టపోయారు. దీంతో వీరు బ్యాంకుల్లోని రుణాలను తీర్చే పరిస్థితి లేదు. అయితే.. పంట రుణాలను పూర్తిగా చెల్లించాలంటూ బ్యాంకర్లు రైతుల ఇళ్లచుట్టూ తిరుగుతున్నారు. ఇలా బ్యాంకు అధికారులు తమ ఇళ్లకు రావడం అవమానంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా పరిష్కారం దొరికేనా..

గత వైసీపీ ప్రభుత్వంలో భూసర్వే పేరుతో రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టారు. వాటన్నింటినీ గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జగనన్న భూరక్ష భూసర్వే ప్రక్రియను నిలుపుదల చేశారు. వైసీపీ హయాంలో చేపట్టిన భూసర్వేలో చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. రెవెన్యూ, సర్వేశాఖలు సమన్వయంతో గ్రామసభలు నిర్వహిస్తున్నాయి. రైతుల నుంచి ఫిర్యాదులు అందిన 15 రోజుల్లో న్యాయం జరిగేలా చూస్తామని అంటున్నారు. ప్రస్తుతం రబీ సీజన్ మొదలైంది. వీలైనంత తొందరగా ఈ ప్రక్రియ పూర్తి చేసి తమకు బ్యాంకుల్లో రుణాలు రెన్యువల్ అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మూడు తరాల నుంచి సాగు చేసుకుంటున్నా..



మూడు తరాల నుంచి సాగు చేసుకుంటున్నాం. జగనన్న భూ రీసర్వేతో మా భూములు వేరొకరి పేరుతో భూపత్రం ఇచ్చినట్లు తెలిసింది. మా పేరు మీద ఉన్న భూమి ఆన్‌లైన్‌లో తొలగించారు. బ్యాంకుకు వెళ్లి అప్పు రెన్యువల్ చేసుకోవాలంటే మీ భూమి ఆన్‌లైనులో లేదు, పూర్తిగా డబ్బులు కట్టేయాలని బ్యాంకు అధికారులు అంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడంలేదు.

\- వెంకటరమణ, రైతు, పాయలకుంట్ల

ఇందిరాగాంధీ టైంలో ఇచ్చారు..



ఇందిరాగాంధి టైంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటే మాకు భూమి ఇచ్చారు. అప్పటి నుంచి మేము సాగు చేసుకుంటూ సర్వహక్కులు కలిగి ఉన్నాం. బ్యాంకులో రుణాలు కూడా తెచ్చుకు న్నాం. ఉన్నట్లుండి మా భూములు ఆన్‌లైన్‌లో నుంచి తీసివేశారు. అధికారుల చుట్టూ తిరిగి ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మా భూములు ఆన్‌లైన్‌లో ఉంచాలి.

\- తిరుపాలయ్య, రామచంద్రాపురం, రైతు



అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్తా

- విద్యుత్ బిల్లులు భారమే
- పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు

ఫటాఫట్

పులివెందుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలో ఆగిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. పులివెందులను మరింత అభివృద్ధి చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఒక లక్ష్యంతో ముందుకు సాగుతానన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ప్రశ్న: కొత్తగా బాధ్యతలు చేపట్టారు.. ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి

జవాబు: పులివెందుల మున్సిపాలిటీలో గతంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాను. ఆ అనుభవంతో ఇక్కడి పరిస్థితులపై త్వరగా అవగాహన తెచ్చుకుని అభివృద్ధిపై దృష్టిసారించాను.

ప్రశ్న: ఆగిపోయిన పనులను ఎప్పటికి పూర్తి చేయనున్నారు

జవాబు: పులివెందుల మున్సిపాలిటీ ఇప్పటికే 90శాతం అభివృద్ధి చెందింది. మరో పది శాతం అభివృద్ధి చెందాల్సి ఉంది. ఆగిపోయిన అభివృద్ధి పనులను వీలైనంత తొందరగా మళ్లీ ప్రారంభించి పూర్తి చేసేందుకు అందరితో చర్చిస్తున్నాను. ప్రభుత్వ సహకారంతో ఈ పనులు పూర్తి చేస్తాం.

ప్రశ్న: విద్యుత్ బకాయిల సమస్య ఎలా తీరుస్తారు?

జవాబు: పులివెందుల మున్సిపాలిటీకి విద్యుత్ బకాయిల సమస్య తీరాలంటే చాలా కష్టమే. ప్రతినెల మున్సిపాలిటీకి దాదాపు కోటి రూపాయల ఆదాయం వస్తుంది. అందులో రూ.49లక్షలు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఖర్చుచేస్తున్నాం. ప్రతినెల రూ.30లక్షలు విద్యుత్ బకాయిలకు వెచ్చిస్తున్నాం. ప్రస్తుతం రూ.27కోట్ల బకాయిలు ఉన్నాయి. గతంలో ఈ విద్యుత్ బిల్లులకు పాడా నుంచి రూ.10కోట్లు చెల్లించేందుకు నిర్ణయించారు. పాడా రద్దుకావడంతో ఆ వ్యవహారం పక్కకు వెళ్లింది.

ప్రశ్న: విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు..

జవాబు: మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లులు మోయలేని భారంగా మారుతోంది. స్తంభాలకు ఉన్నవీధి లైట్లను ఒకటి మార్చి ఒకటి ఆన్ చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా మున్సిపాలిటీ ఇబ్బంది పడకుండా విద్యుత్‌ను వినియోగించుకునేలా చూస్తున్నాం.

ప్రశ్న: మున్సిపాలిటీ ఆదాయం పెరిగేందుకు..

జవాబు: మున్సిపాలిటీ ఆదాయం ఒక్కసారిగా పెరగాలంటే పెరగదు. వచ్చేఆదాయాన్ని, రావాల్సిన ఆదాయాన్ని ప్రతినెల వసూలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. బిల్లులు చెల్లించేందుకు ప్రజలు సచివాలయాల వద్దకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. దీంతో మొబైల్ కలెక్షన్ వాహనాన్ని ఏర్పాటుచేసి ఇళ్ల వద్దకే వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నాం. త్వరలో క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు చెల్లించే విధానాన్ని తీసుకురానున్నాం.



క్రిష్ణారావుకు నియామకపత్రం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారిగా క్రిష్ణారావు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారిగా రసాయన శాస్త్ర ప్రొఫెసర్ కేఎస్‌వీ క్రిష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వైస్‌చాన్సలర్ చాంబరులో క్రిష్ణారావుకు వీసీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ నియామక ఉత్తర్వులను అందించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి క్రిష్ణారెడ్డి పదవీ కాలం పూర్తవడంతో నియంత్రణ అధికారి పోస్టు నుంచి రిలీవ్ అయ్యారు. పరీక్షల విభాగం చాలా బాధ్యతతో కూడుకున్నదని, ప్రభావవంతంగా పనిచేయాలని నూతన సీఈకి వీసీ సూచించారు.

డీఈవోగా మీనాక్షి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా యు.మీనాక్షిని నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. సత్యసాయి జిల్లా ధర్మవరం ఉప విద్యాధికారిగా పనిచేస్తున్న ఈమెను ప్రొద్దుటూరు ఉపవిద్యాధికారిగా నియమించారు. అయితే జిల్లా విద్యాశాఖాధికారి పోస్టు భర్తీ అయ్యేంత వరకు ఈమె తన సొంత వేతన స్కేలుపై డీఈవోగా కొనసాగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇది వరకు పనిచేస్తున్న డీఈవో ఎం.అనురాధను బదిలీ చేశారు. అయితే ఈమెను పోస్టింగ్ నిమిత్తం ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీల ఫైనల్ మెరిట్ లిస్ట్

కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర సిబ్బంది పోస్టులకు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టు డీఈవో వెబ్‌సైట్‌లో, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీసుబోర్డులో పొందుపరిచామని డీఈవో అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు లిస్టును సరిచూసుకోవాలని సూచించారు.

నేటి నుంచి పశుగణన సర్వే

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్న పశుగణన సర్వే పక్కాగా చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్, సంబంధిత అధికారులతో కలసి పశుగణన సర్వేకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంపద దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధానమైనదన్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు మొదలైనవి రైతులకు జీవనోపాధినిచ్చే వనరులన్నారు. పాడిపశురంగానికి మన దేశ స్థూల ఉత్పత్తిలో దాదాపు 4.11 శాతం వాటా, వ్యవసాయ స్థూల ఉత్పత్తిలో 29.35 శాతం వాటా ఉందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత పోషిస్తున్న పశు సంపదను సరిగ్గా లెక్కించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ఇంటింటికి సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, నోడల్ అధికారి ప్రమోద్ కుమార్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశుగణనకు సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లను ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆవిష్కరించారు.

10 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కడపలో నవంబరు 10 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణపై డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్, ఏఎస్పీ ప్రకాశ్, బీసీ రిక్రూట్మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్ దీప్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతోందన్నారు. ఇందులో చేరాలనుకునే వారికి ఇప్పటికే రాత పరీక్షలు పూర్తయ్యాయన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ పరీక్షలు కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఫిజికల్ టెస్టుకు రాష్ట్రంలోని కర్నూలు, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, కడప, బాపట్ల, చిత్తూరు, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరవుతారన్నారు. వారందరికీ కనీస మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని, ఈ పనులన్నీ నవంబరు 6లోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



అందరికీ కందిపప్పు

- సరిపడా చౌక దుకాణాలకు కేటాయింపు
- గత నెల వరకూ అరాకొరా పంపిణీ
- 1వ తేదీ నుంచి కిలో రూ.67తో అందరికీ పంపిణీ

6



ఎండీయూల వ్యవస్థను రద్దు చేయాలి 6



కడప గానకోకిల మహతి

- కడప కళాతోరణంలో మరో ఆణిముత్యం
- లగ్గం సినిమాలో రెండు పాటలకు అవకాశం

6

సీఎం చంద్రబాబుగారూ.. న్యాయం చేయండి

- సొంత పార్టీ నేతలతో నాకు ప్రమాదం ఉంది
- కడపలో విష సంస్కృతి ప్రారంభమైంది
- పోలీసు కథనంలో వాస్తవం లేదు
- టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి చంద్రబాబుగారూ.. కడపలో విష సంస్కృతి ప్రారంభమైంది. నాపై దాడి కేసు విషయంలో పోలీసులు చెప్పే కథనంలో ఎటువంటి వాస్తవం లేదు. ఈ కేసును పునర్విచారణ చేయించి నాకు న్యాయం చేయండి" అని టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి ప్రాధేయపడ్డారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక వీడియో విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ.. తనపై దాడి ఘటనకు సంబంధించి పోలీసుల కథనంలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం లేదన్నారు. తన తల్లిదండ్రులు ఇచ్చిన 90లక్షల రూపాయలతో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అలాగే చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు కార్యకర్తల బలోపేతానికి కృషిచేశానన్నారు. తనకు కనీసం సొంత ఇల్లు కూడా లేదన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో సొంత డబ్బులతో శిబిరం ఏర్పాటు చేసి ఆయన జైలు నుంచి బయటకు వచ్చే వరకు దీక్షలు నిర్వహించామన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ విజయానికి ఎంతో కృషి చేశానన్నారు. అయితే ఈ మధ్యకాలంలో కడప నగరంలో విష సంస్కృతి వచ్చిందన్నారు. సొంత పార్టీ నేతలతోనే తనకు ప్రమాదం పొంచి ఉందన్నారు. తనకు మంత్రి నారాలోకేశ్, సీఎం చంద్రబాబునాయుడు న్యాయం చేయాలని కోరారు. నగరంలో కార్యకర్తలందరూ భయంతో ఉన్నారని తెలిపారు. తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

తనను కొట్టిన వారు లక్కిరెడ్డిపల్లెకు చెందిన వారని, వారు ఓ కుటుంబానికి వీరభక్తులని తెలిపారు. అయితే పోలీసులు చెప్పిందాంట్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. తనది ఎవరినీ బెదిరించే మనస్తత్వం కాదని, అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు తనకు లేవని అన్నారు. ప్రతి విషయంలోనూ పోలీసులు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిం ది చెబుతారని.. అయితే తన విషయంలో పోలీసులు అలా చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తనపై జరిగిన దాడికి పాత్రికేయులు ఉండడంతోనే ఈరోజు బతికి బట్టకట్టినట్లు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలుస్తామన్నారు. అలాగే ఎస్పీ తనకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



దీపావళికి ట్రిపుల్ ధమాకా

- ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లకు క్యాబినెట్ ఆమోదం
- జిల్లాలో 3.69 లక్షల దీపం కనెక్షన్లు
- ఒక్కో సిలిండర్ రూ.853 చొప్పున 3 సిలిండర్లకు రూ.2,559ల లబ్ధి
- ఏడాదికి ప్రభుత్వ ఖజానాకు రూ.94.42 కోట్ల భారం

కడప కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పేదింటి మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం దీపావళికి ట్రిపుల్ ధమాకా ప్రకటించింది. జిల్లాలో దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్ ఉన్న 3.69లక్షల పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారం చేపట్టాక ఒక్కొక్కటి నెరవేర్చేందుకు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే వృద్ధులకు పింఛన్, ఉచిత ఇసుక విధానం, రైతులను గందరగోళ పరిచిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, భూముల రీసర్వేలో జరిగిన అవకతవకల దిద్దుబాటు.. ఇలా ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తోంది. తాజాగా బుధవారం మంత్రిమండలి సమావేశంలో ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. ఇది మహిళా లోకానికి శుభవార్తే. దీనికి సంబంధించి మరో రెండురోజుల్లో మార్గదర్శకాలు జారీ కానున్నాయి. ఒక్కో సిలిండర్ ధర ప్రస్తుతం రూ.853 ఉండగా ఏడాదికి 3 సిలిండర్లకు గానూ రూ.2,559ల లబ్ధిని అందించనున్నారు. ఈ లెక్కన జిల్లాలో 3.69 లక్షల గ్యాస్ కనెక్షన్లకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు సక్రమంగా వినియోగమైతే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.94.42 కోట్ల భారం పడనుంది. ఈ మేరకు పేదలకు లబ్ధి చేకూరనుంది.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు 12.27 లక్షలు

జిల్లాలో 22.50 లక్షల జనాభా ఉంది. వీరందరికీ కలిపి కమర్షియల్, దీపం, ఉజ్వల తదితర పథకాల కింద 12.27 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కాగా జిల్లాలో పేదరికానికి దిగువన ఉన్న 5,86,352 తెల్ల రేషన్‌కార్డు దారులున్నారు. వీరిలో దీపం కనెక్షను 3.69 లక్షల మందికి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల పథకం కింద మరో 50 వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన 50 వేల మంది కుటుంబాలకు ఇప్పటికే ప్రతి గ్యాస్ సిలిండర్ కొనుగోలుపై రూ.343 సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. ఈ నేపథ్యంలో ఉజ్వల పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వర్తించదని తెలుస్తోంది.





కడప గాన కోకిల మహతి

● కడప కళాతోరణంలో మరో ఆణిముత్యం

● లగ్గం సినిమాలో రెండు పాటలు పాడిన గాయని



లగ్గం చిత్రంలో పాటలు పాడిన మహతిని అభినందిస్తున్న హీరో సుమన్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప కళాతోరణంలో ఆ యువతి మరో ఆణిముత్యం. తన గాన మాధుర్యంతో అంచెలంచెలుగా ఎదుగుతూ లగ్గం సినిమాలో రెండు పాటలు పాడి అలరించారు. ఆ ఛాన్స్ కొట్టింది మరెవరో కాదు.. కడప నగరం మోచంపేటకు చెందిన మాజీ కార్పొరేటరు సురేశ్‌బాబు, సౌజన్య కుమార్తె.. మహతి. 20 ఏళ్ల ఆ యువతికి పాటలంటే ప్రాణం. చిన్ననాటి నుంచి శాస్త్రీయ సంగీతంపై మక్కువ ఎక్కువ. బుల్లితెర పోటీల్లోనూ పాల్గొని తన సత్తా చాటుకున్నారు. తన కుమార్తె మక్కువను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు గురువు నంద్యాల లలిత చెంత శిక్షణ ఇప్పించారు. ఆమె శిష్యరికంలో ఎన్నో సంగీత మెళకువలు నేర్చుకున్నారు. అనేక సంగీత పోటీల్లో విజేతగా నిలిచారు. కొన్ని సినిమాలకు ఆమె సినీ దర్శకుల సూచనల మేరకు ట్రాక్‌లు పాడారు. ఇటీవల సుబ్బిసి ఎంటర్‌ప్రైజెస్ నిర్మిస్తున్న లగ్గం సినిమాలో ఆమెకు రెండు పాటలు పాడే అవకాశం లభించింది. ఒక పాట యుగళగీతం కాగా.. మరొకటి సహగాయనితో కలిసి పాడారు. ఈ సినిమాకు శంకర్ అర్జున్ సంగీతం అందించగా.. రమేశ్ చెప్పల దర్శకత్వం వహించారు. లగ్గం సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

బహుమతులు ఇలా

ఆరేళ్లప్రాయం నుంచి గానంపై మక్కువతో మహతి పాటలు పాడడం ప్రారంభించారు. అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా వేదికలపై గాత్ర కచేరి పోటీల్లో పాల్గొంది. దాదాపు 50కి పైగా గాన పోటీల్లో బహుమతులు అందుకున్నారు.

- 2009లో రాజంపేట స్వరాంజలి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు.
- 2009-10 శ్రీవాణి అర్జున్ నిర్వహించిన అన్నమయ్య త్యాగరాజ సంగీతోత్సవాల్లో ప్రథమ బహుమతి.
- 2009 కడప అహోబిళం మఠం శ్రీ శ్రీ ష్టా ష్ట వి సందర్భంగా నిర్వ హించిన పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010లో రాజంపేట కళాంజలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010- 11లో కడప ఆర్తిహోంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ, ప్రథమ బహుమతులు పొందారు.
- 2011లో ఈటీవీ నిర్వహించిన లిటిల్‌ఛాంప్స్‌లో పాల్గొన్నారు. పాడుతా తీయగా కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.



గాయని పి.సుశీలతో మహతి



సునీల్‌తో..



లిటిల్‌ఛాంప్స్ కార్యక్రమంలో ఎస్పీ శైలజతో

కీర్తనలంటే ప్రాణం

దేవదేవభజం, ఆరగించి కూర్చున్న నల్లవాడే, ఏ తీరుగనను దయచూచెదవో తదితర అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు, సినిమాల్లో భక్తిరస పాటలంటే మహతికి చాలా ఇష్టం.

విద్యాభ్యాసం


మహతి పాఠశాల విద్యను కడప విద్యామందిర్‌లో పూర్తి చేశారు. ఇంటర్ ఓపెన్ స్కూలులో చదివి బీబీఏ డిగ్రీని విజ్ఞాన్ కళాశాలలో పూర్తి చేశారు. ప్రస్తుతం తిరుపతి పద్మావతి యూనివర్శిటీలో సంగీతంలో ఎంఏ కోర్సును చదువుతున్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలో వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యర్రదొడ్డిపల్లె సమీపంలో జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం టి.చెరుకువారిపల్లెకు చెందిన కోటగుండ్ల కృష్ణయ్య (30) కలకడ టమోట మార్కెట్‌లో పనులు ముగించుకుని బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో కలికిరి నుంచి ఎదురుగా వస్తున్న కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కారు నడుపుతున్న మహల్‌కు చెందిన షర్ఫుద్దీన్ కారును నిర్లక్ష్యంగా నడుపుతున్న కారణంగానే మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టినట్లు సీఐ పేర్కొన్నారు. తీవ్ర గాయాలకు గురైన కృష్ణయ్యను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణయ్య మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జె.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరించారు. మృతుడు కృష్ణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల మధ్యాహ్న 'బిక్ష'



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్థానిక భక్తులకు గురువారం ముస్లిం సంఘాలు మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేశాయి. మదనపల్లె రోడ్డులో వున్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ బిక్ష కార్యక్రమాన్ని అయ్యప్పస్వాములకు ఏర్పాటు చేశారు. జమాయత్-ఏ- ఉలేమా జిల్లా కార్యదర్శి ముస్తఫా హజరత్ ఆధ్వర్యంలో స్వాములకు ఈ ఏర్పాట్లు చేశారు. తాము హిందూ, ముస్లింల సంఘీభావం కోసం ప్రతి ఏడాది దీక్షలో వున్న అయ్యప్పస్వాములకు ఆహార సౌకర్యం కలిగిస్తున్నట్లు ముస్తఫా పేర్కొన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, కఠిన నియమాలతో చేపట్టిన అయ్యప్పస్వాముల దీక్ష ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇదే సాంప్రదాయాన్ని ఇక మీదట కూడా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమలో ముస్తఫా హజరత్‌తో పాటు ఖాదర్‌వల్లీ, బాషా, ఇస్మాయిల్, గురుస్వామి, మునిస్వామి, రాజాస్వామి, శంకరస్వామితో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

రామసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం మండలంలోని మినికి పంచాయతీ గుంతవారిపల్లెకు చెందిన దంపతులు గోవిందరెడ్డి, లీలావతమ్మ దీపావళి పండుగకు సరుకులు కొనుక్కొని రావాలని గురువారం ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరారు. మార్గమధ్యలోని కొత్తూరు క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను చికిత్స కోసం మదనపల్లెకు తరలించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు చింతరాచపల్లె విద్యార్థులు




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరాచపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ ఆథారిటి స్టేడియం కడపలో జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరచి ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బాలురు ఎం.విజయ్, బాలికల విభాగంలో బి.రమ్య, టి.సుచిత్రలు ఎంపికయ్యారు. వీరు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-14లో రోహిణి, అభిలాష్‌లు ఎంపిక కావడం జరిగింది. వీరు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా స్టేడియం బాస్కెట్‌బాల్ జరిగిన ఎంపికల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అండర్-17 విభాగంలో జి.ఓబయ్య, బి.లావణ్య ఎంపిక కావడం జరిగింది. అండర్-14లో గౌతమ్ ఎంపిక కావడం జరిగింది. వీరు మదనపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఫిజికల్ డైరెక్టర్ పి.వెంకటసుబ్బయ్య తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు పి.గంగరాజు అభినందించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురంలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల నగరోత్సవం



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● పురవీధులలో నగరోత్సవం

వాల్మీకిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీపట్టాభిరామాలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయంలోని మండపంలో మామిడి తోరణాలు, పుష్పలంకరణలతో కల్యాణ వేదిక సిద్ధం చేసి భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు విశేష అలంకరణలు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు పూర్తి చేసి వేడుకల్లో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా సాయంత్రం విశేష అలంకరణలతో ముస్తాబైన ఉత్సవ మూర్తులను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు అనిల్ స్వామి, భాషిచార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

అందరికీ కందిపప్పు !

● సరిపడా చౌక దుకాణాలకు కేటాయింపు

● గత నెల వరకూ అరాకొరా పంపిణీ ● 1వ తేదీ నుంచి కిలో రూ.67తో అందరికీ



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ శుభ వార్త. నవంబరు 1వ తేదీ నుంచి కార్డుదారులందరికీ చౌక దుకాణాల ద్వారా కందిపప్పు అందనుంది. కిలో రూ.67 వంతున ప్రతి కార్డుకు కిలో కందిపప్పును అందజేయనున్నారు. ఇలా కార్డుదారులందరికీ నెల నెలా కందిపప్పు పంపిణీ చేసిన దాఖలాలు గత ఐదేళ్లుగా లేవు. ప్రతి నెలా కేవలం 25 శాతం మాత్రమే పంపిణీ జరిగేది. ఇలా అరాకొర పంపిణీ చేయడంతో ప్రభుత్వం నుంచి అసలు కందిపప్పు సరఫరా లేదని చౌక దుకాణాల యజమానులు బుకాయించడం పరిపాటిగా జరిగేది. ప్రతి నెలా కొంత మందికి మాత్రమే పంపిణీ చేస్తుండటంతో ప్రభుత్వం నుంచి సక్రమంగా సరఫరా కావడం లేదని కార్డుదారులు కూడా సమాధాన పడేవారు. వచ్చే నెల నుంచి ఈ గందరగోళానికి తెరపడనుంది. కార్డుదారులందరికీ ఒకేసారి కందిపప్పు పంపిణీ చేయడానికి పౌర సరఫరాల శాఖ అవసరమైన నిల్వలను సిద్ధం చేసింది. చౌకదుకాణం యజమానులంతా తమకున్న కార్డుల మేరకు కందిపప్పుకు కూడా డీడీలు చెల్లించాలని పురమాయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 5,04824 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుదారులందరికీ సరిపడా 505 టన్నుల కందిపప్పును మండల స్థాయి స్టాకు పాయింట్లలో సిద్ధంగా వుంచారు. ఇక నుంచి చౌకదుకాణాల యజమానులు లేదా ఎండీయూ వాహనదార్లు అందరికీ సరిపడా కందిపప్పు సరఫరా లేదని సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రతి కార్డుకూ కిలో వంతున రూ.67ల ధరతో కందిపప్పు తప్పనిసరిగా పంపిణీ చేయక తప్పదు. ఇప్పటికే డీడీలు చెల్లించిన చౌక దుకాణాలన్నింటికీ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అవసరమైన మేరకు కందిపప్పు స్టాకున తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.170 వరకూ పలుకుతోంది. దీంతో రేషన్ కార్డుదారులంతా కూడా కందిపప్పు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తారని, ఎక్కడయినా కందిపప్పు సరిపడా స్టాకు రాలేదని చెపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పౌర సరఫరా అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో వున్న 39,563 అంత్యోదయ కార్డులకు కార్డుకు కిలో వంతున రూ.13.50 ధరతో చక్కెర కూడా పంపిణీ చేయనున్నారు. ఇక మిగిలిన సాధారణ కార్డులకు అర కిలో వంతున రూ. 17తో అందజేయనున్నారు.

హార్స్‌లీహిల్స్‌లో అతిథిగృహం పనుల పరిశీలన



అసంపూర్తిగా వున్న హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథిగృహం

బి.కొత్తకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథి గృహం పనులను పూర్తి చేసేందుకు అధికారులు అంచనాల తయారీలో నిమగ్నమయ్యారు. హిల్స్‌పై వున్న పురాతన అతిథి గృహాన్ని తొలగించి, దాని స్థానంలో అధునాతన పద్ధతిలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్నప్పటికీ ఇంటీరియర్‌వర్క్, వైరింగ్, వుడ్‌వర్క్, పెయింటింగ్, శానిటరీ తదితర పనులు అసంపూర్తిగా వున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ నుంచి ఆదేశాలు అందడంతో, ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, డీఈ సూర్యనారాయణలు గురువారం హార్స్‌లీహిల్స్‌కు చేరుకొని అతిథి గృహాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో వున్న పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవడానికి అవసరమైన నిధులపై అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పిస్తామని వీరు పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

ఎండీయూల వ్యవస్థను రద్దు చేయాలి


● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న దివి లీలామాధవరావు

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో గురువారం రేషన్ డీలర్ల జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలకు సమాంతరంగా మరో వ్యవస్థను తీసుకొచ్చి అన్నింటినీ కలుషితం చేసిందని ఆరోపించారు. దీంతో ఏదీ కూడా పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నారని, అన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2014-2019 మధ్య కాలంలో రేషన్ డీలర్లకు క్వింటాల్ బియ్యానికి రూ.20 నుంచి రూ.70, ఆ తర్వాత రూ.100కు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే రంజాన్, సంక్రాంతి, క్రిస్మస్ కానుకనలు అదనంగా ఇవ్వడం ద్వారా ఏడాదికి రూ.18 కోట్లు కమీషన్ రూపంలో డీలర్లకు సమకూరినట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.7500, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు ఉన్న కమీషన్‌ను రూ.15 వేలు చేయాలని గతంలో చంద్రబాబు ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలను రాష్ట్ర కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఆర్.జె.వెంకటేష్, ప్రసాద్‌రావు, మొటుకుపల్లె శివ, తదితరులు మాట్లాడారు. సమావేశంలో గుంటూరు జిల్లా కార్యదర్శి పీటీఎల్ వరప్రసాద్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాషా, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు షేక్ ఇమామ్‌ఖాసీం, రూరల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మురళి, సుధీర్‌బాబు, కళాధర్, వై.అంజనప్ప, కవిత, షేక్ ముంతాజ్‌లతో పాటు జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి



రేషన్ డీలర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఎస్ఐ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బి.గోపాల్‌రెడ్డిని, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా షేక్ ఇమాంఖాసీం, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఫరీద్‌బాషా, కోశాధికారిగా వి.సుధీర్ బాబు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా ముంతాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రామాచార్లపల్లె కృష్ణమూర్తి, జయం మురళి, సుధీర్‌బాబు, కవిత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన కూటమి నేతలతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావును సన్మానించారు.

వర్షంతో దెబ్బతిన్న బొప్పాయి తోటలు

● రూ.కోట్లాది రూపాయల నష్టం ● లబోదిబోమంటున్న రైతాంగం ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బతింటున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో తోటల్లో నీరు నిలిచింది. వర్షం ఆగిపోయేంత వరకు చెట్లు పచ్చగానే ఉన్నాయి. సూర్యరశ్మి పడే కొద్ది చెట్లు ముడుచుకుపోయాయి. కాయలు తోటల్లోనే మాగడం, బూజు పట్టడం తదితర రకాలుగా దెబ్బతిని పనికి రాకుండా పోతున్నాయి. దీంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో మామిడి, అరటి తర్వాత బొప్పాయి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సుమారు 15వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ఒక ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దున్న కాలు, ఎరువులు, మొక్కలు, పురుగు మందులు తదితర వాటికి రైతులకు ముందుగానే వ్యాపారులు కొంత డబ్బులు ఇస్తారు. ఈ డబ్బులను పెట్టుబడిగా పెట్టి రైతులు సాగులోకి దిగుతారు. బొప్పాయికి ప్రకృతి వైపరిత్యాలతో పాటు చీడపీడలు ఆశిస్తే మొక్కలు తట్టుకోలేవు. మొక్కలు నాటిన తర్వాత వర్షం కురిస్తే చనిపోతాయి. పెద్ద చెట్లు అయినా చనిపోతాయి. కాయలు దెబ్బతింటాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితాలు ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షం దెబ్బకు జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, జీవామృతం వంటి ప్రయోగాలు చేసిన రైతుల తోటలు కూడా ముడుచుకుపోయి కాయలు దెబ్బతిన్నాయి. చాలా మందికి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బొప్పాయి తోటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


ఉప్పరపల్లెలో ముడుచుకుపోయిన బొప్పాయి చెట్లు



ప్రభుత్వం ఆదుకోవాలి

రైల్వేకోడూరు మండలంలో వర్షం దెబ్బకు చాలా వరకు బొప్పాయి తోటలు తుడిచి పెట్టుకుపోయాయి. వర్షం పడినప్పుడు బాగా పచ్చగానే ఉన్నాయి. వర్షం తగ్గిన కొన్ని రోజులకు మొదట ఆకులు పూర్తిగా ముడుచుకుపోయాయి. కాయలు క్రమీణా దెబ్బతింటున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

-కోనేరెడ్డి రామసుబ్బారెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు



ప్రతి ఏడాది నష్టపోతున్నాం.

ప్రతి ఏడాది ప్రకృతి వైపరిత్యాలతో బొప్పాయి పంట దెబ్బతిని నష్టపోతున్నాం. ఈ ఏడాది ఎడతెరిపి లేని వర్షం కారణంగా తోటలు దెబ్బతిని నష్టపోతున్నాం. కాయకష్టం చేసినా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాగులో ఎక్కడ రాజీ లేకుండా చేసినా నాసిరకం విత్తనాలతో నష్టపోతున్నాం.

-గుండాల దామోదర్‌రెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు

జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా అమీర్‌బాబు



అమీర్‌బాబు, సత్తార్‌ఫైజి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరక్కీ ఉర్దూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నవంబరు 9, 10 తేదీల్లో కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరగనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా వీఎస్ అమీర్‌బాబు, ఛైర్మన్‌గా సత్తార్‌ఫైజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ ప్రధానకార్యదర్శి సయ్యద్ హిదయతుల్లా తెలిపారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాల తరువాత కడపలో మళ్లీ జాతీయ స్థాయిలో ఉర్దూ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉర్దూ విద్య, సాహిత్య, సారస్కృతిక సమస్యలు పరిష్కారం మన బాధ్యత అన్న అంశంపై దాదాపు 24 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించనున్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్తలకు కవులు, రచయితలు సాహితీ విమర్శకులు పాల్గొంటారన్నారు. ఈ రెండురోజుల కార్యక్రమాలు సెమినార్ ప్రారంభోత్సవం, ఉర్దూ సావనీర్ ఆవిష్కరణ, జాతీయ స్థాయిలో కవి సమ్మేళనం వ్యక్తృ త్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తారని తెలిపారు.

జేఎన్టీయూలో ప్రారంభమైన యంత్ర-2కె24


యంత్ర-2కె24 జాతీయ సదస్సు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేఎన్టీయూ కళాశాలలో యంత్ర-2కె24 జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హెడ్ మెకానికల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి ఎఫ్3 కార్ డిజైన్ మరియు రోబొటిక్స్ పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఈ సదస్సులో హైస్పీడ్ ఎలక్ట్రికల్ వెహికల్ (ఎఫ్3 కార్ మోడల్) మరియు ఐఓటీ విత్ హ్యూమనాయిడ్ రొబొటిక్స్‌పై విద్యార్థులకు మూడు రోజజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణకాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, దేశం నలుమూలల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి అన్నారు. జిల్లాలో ఆ శాఖ పర్యటనలో భాగంగా గురువారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీకళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అంటే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యం పరిరక్షించుకోవాలని, వారి మనసు చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం స్టేట్ గెస్ట్‌హౌస్ లో యువజన సంఘ సభ్యులు, స్వచ్ఛంధ సేవా సంస్థలతో యువజన సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33 శాతం ఉన్నదని, ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదన్నారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, స్టెప్ మేనేజరు వీవీ సుబ్బరాయుడు, సిబ్బంది అబ్బాస్‌అలీ, నాగయ్య, వీవీ నారాయణ పాల్గొన్నారు.

ఏపీ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికారిక సంస్థ సభ్యుడిగా డాక్టర్ చంద్రశేఖర్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ సభ్యుడిగా వైవీయూ పర్యావరణ శాఖ సహాయాచార్యులు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు సెంట్రల్ గవర్నమెంటు ఎన్విరాన్‌మెంటు ఫారెస్టు అండ్ క్లైమెట్ ఛేంజ్ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ అమన్‌దీప్‌గార్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఛైర్మన్‌తో పాటు మెంబరు సెక్రటరీ సభ్యులు కలిసి రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్ ● కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్


పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎఫ్ఓ వినీత్‌కుమార్, అటవీశాఖ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రేంజి గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతమైన సాలుపెంట ప్రదేశంలో అటవీశాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా స్మగ్లర్లు 14 ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతుండగా దాడులు నిర్వహించి చాపాడు మండలానికి చెందిన హబీబుల్లా, తమిళనాడుకు చెందిన గోపీ, తీర్థగిరిలను అరెస్ట్ చేశారన్నారు. చాపాడు మండలానికి చెందిన జాకీర్ అనేవ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన స్మగ్లర్ల వద్ద నుంచి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారన్నారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు 1,06,686 రూపాయలు విలువ చేస్తాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచదనం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా కార్యక్రమంలో సబ్‌డీఎఫ్‌వో స్వామివివేకానంద, రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, సెక్షన్ అధికారి సురేష్‌బాబు, ఫారెస్ట్ బీట్ అధికారులు మధు, విశ్వనాథ్, పెంచల్‌రెడ్డి, అసిస్టెంట్‌బీట్ అధికారులు హైమావతి, ప్రొటక్షన్ వాచర్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరాజపురంలో చోరీ

30 గ్రాముల బంగారం, రూ. 38 వేల నగదు అపహరించిన దొంగలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24:(ఆంధ్రజ్యోతి) మండలంలోని రాఘవరాజపురం గ్రామానికి చెందిన ఈదర పార్థసారథి ఇంటిలో చోరీకి పాల్పడి 30 గ్రాముల బంగారు నగలు, రూ.38 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి వివరాల మేరకు.. పార్థసారథి తన కుటుంబ సభ్యులతో కలసి కమలాపురానికి బుధవారం వెళారు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి... ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు బంగారు చైన్లు, రెండు చిన్న ఉంగరాలు, ఒక గొలుసు, కమ్మలు, రూ.38వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కమలాపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై పందిళ్లపల్లె వద్ద శ్రీభైరవేశ్వర ఆలయ సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసుల సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు మొలకవారిపల్లెకు చెందిన చింతకుంట రవిశంకర్‌రెడ్డి (50)గా పోలీసులు గుర్తించారు. 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఓ సిమెంటు కంపెనీలో ప్రొక్లైనర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

గండికోట నుంచి 6వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం/మైలవరం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి గురువారం 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కుల కృష్ణాజలాలు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈఈ నరసింహమూర్తి తెలిపారు. మైలవరం ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గండికోట నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి విడుదల చేయడం జరుగుతుందని డీఈఈ తెలిపారు.

చంద్రబాబును కలిసిన గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయాలపై చర్చించారు. అలాగే కార్యకర్తలకు అండగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అతిథిసింగ్


రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వేలో రైతన్నలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రెవెన్యూ సద స్సులను నిర్వహిస్తోంది. గురువారం బ్రహ్మంగారిమఠం మండ లంలోని ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బద్వేలు డివిజను ఆర్డీవో చంద్ర మోహన్, బి.మఠం తహసీల్దారు దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన ఈ సదస్సులకు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతన్నలతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీసర్వేలో భూములు కోల్పోయినట్లు తమ దృష్టికి తెస్తే జిల్లా స్థాయి అధికారులతో కమిటీ వేసి గ్రామస్థాయిలో సర్వేలు నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్ల విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన రైత న్నలకు సత్వరమే నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచా యతీల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. రీసర్వేలో కొందరు రైతులు తమ భూములు కోల్పోయారని తెలిపారు. అలాగే జాతీయ రహదారి పనులు విస్తరణలో భూములు కోల్పోయిన కొంతమందికి మాత్రమే నష్టపరిహారం వచ్చిందని.. మిగిలిన వారికి వెంటనే నష్టపరిహారం అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టరును కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, హైవే రోడ్డు అధికారులు, మాజీ ఎంపీటీసీ రమేశ్, చిలమల నారాయణ, చిలమల నాగయ్య, మస్తాన్, శ్రీను, ముడుమాల పోలిరెడ్డి, సురేంద్రయాదవ్, మేకల సుధాకర్, వెల్లటూరు సాంబశివారెడ్డి, వీరయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047లోని లక్ష్యాలను సాధించేందుకు అధికారులందరూ కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్, స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలు, 686 మండలాల నుంచి స్వర్ణాంధ్ర-2047పై విజన్‌పత్రాలు అందాయని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. విజన్ పత్రాలను రూపొందించిన అనంతరం జిల్లాలు, మండలాల పనితీరుపై సూచికలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా ముఖ్యమంత్రి, ఉప మంత్రివర్యుల సమక్షంలో త్వరలో స్వర్ణాంధ్ర-2047కు సంబంధించిన పూర్తి నివేదికను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, అన్న మయ్య జిల్లాకు సంబంధించిన స్వర్ణాంధ్ర-2047 గురించి మాట్లా డుతూ జిల్లాలో పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, నైపుణ్య అభివృద్ధి తదితర రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో మన జిల్లాకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. డీఆర్‌వో సత్యనారాయణరావు, సీపీవో వెంకట్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సందేహాల నివృత్తికే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

● ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ చంద్రమౌళిసింగ్


ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేస్తున్న చంద్రమౌళి సింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్‌లకు సంబంధించి వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో అకౌంటెంట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్ మరియు అకౌంట్స్‌శాఖల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఉద్యోగుల జీపీఎఫ్, పెన్షన్ సమస్యలపై అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి డైరెక్టరేట్ ఆఫ్ ఆడిటర్ జనరల్ లలిత్ కుమార్, ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహన్‌రావుల పాల్గొన్నార. ఈసందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అయిన మరుసటి రోజునే పెన్షన్ మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్ధేశ్యమన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఉద్యోగి ఆరు నెలల లోపు పెన్షన్‌కి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ఆశాఖల డీడీలకు పంపాలన్నారు పదవీ విరమణ సమయానికి సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ ఉండేలా చూసుకోవడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. రిసర్వీసు రిజిస్టర్‌లో అన్ని ఎంట్రీలు కరెక్ట్‌గా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఎటువంటి లోన్ పెండింగ్ కేసులు ఉండకూడదన్నారు పెన్షన్ డాక్యుమెంట్ అందిన వెంటనే ఏజీ నియమ నిబంధనల ప్రకారం వేగవంతంగా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మా నోటీసుకు రాని జీపీఎఫ్, పెన్షన్ సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే అదాలత్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులకు, పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లను అందజేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు సునీత, చంద్రశేఖర్, భవానీప్రసాద్, విజయ్‌కుమార్, జిల్లా ట్రెజరీశాఖ డీడీ వెంకటేశ్వర్లు, సబ్‌ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే యువత డ్రగ్స్ వైపు

● కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కొంత మంది యువకులు గంజాయితో పాటు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని.. ఈ దుస్థితి గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే నెలకొందని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వారు మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. యువకులు మత్తుకు సంబంధించిన ట్యాబ్లెట్లను ఇంజక్షన్ రూపంలో వినియోగించుకుంటున్నారని.. వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా ట్యాబ్లెట్లు విక్రయిస్తున్నారని రూ.300 విలువ చేసే ట్యాబ్లెట్లు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నగరంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతోందని.. వీటిని వాడిన యువకులతో పాటు మైనరు పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. మత్తుకు బానిసైన యువకుల కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకురావడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశామని.. ఆయన సానుకూలంగా స్పందించి వాటి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

మా పిల్లలను రక్షించండి

మా బిడ్డలు మత్తు పదార్థాలకు అలవాటు పడి.. ఆ మత్తులో ఇంట్లో డబ్బులు ఇవ్వాలంటూ నసపెడుతున్నారని.. ఇవ్వలేదంటే కొడుతున్నారని మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసు అధికారులు చర్యలు తీసుకుని డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్తం

సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే చేపట్టినట్లు తహసీల్దారు సరస్వతి అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లెలో గురువారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా రికార్డుల్లో పేరు తప్పు, విస్తీర్ణం, సర్వే నెంబర్లు వాటిపై సమస్యలు తెలిపారు. గ్రామ సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

'సీడీపీఓను సస్పెండ్ చేయాలి'

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ వర్కర్ రజని అనారోగ్యానికి కారణమైన కడప సీడీపీఓను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ నగర జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు చంద్రారెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కడప నగరం సున్నపుబట్టీలు-1 సెంటరులో పనిచేస్తున్న కార్యకర్త సీఎస్ రజనీ కేంద్రాన్ని ఈ నెల 19న పర్యవేక్షణ పేరుతో వెళ్లి బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు.

నేడు సమావేశం

పెండ్లిమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీక మాసోత్సవాలపై అధికారులు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఓ మాట్లాడుతూ కార్తీక మాసం-2024 పండుగ సందర్భంగా కార్తీకమాసం మహోత్సవాల ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏపీ టూరిజం భవనంలో నిర్వహిస్తామని, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

శ్మశాన ఆక్రమణను అడ్డుకోండి

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్మశానం ఆక్రమణలను అడ్డుకోవాలని రాయలోరిపల్లె ప్రజలు ఏటూరు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. మామిళ్లపల్లె పొలంలో దాదాపు 3 ఎకరాలకుపైగా శ్మశాన వాటికకు వాడుకుంటున్నారు. అయితే కొందరు ఆ స్థలానికి పాస్‌బుక్కులు ఉన్నాయంటూ తమదని గ్రామస్థులను అడ్డుకోవడంతో గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందించారు. శ్మశాన స్థలాన్ని కాపాడుతామని తహసీల్దారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ సుకుమార్ తెలిపారు. ఆజాద్‌నగర్‌లో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో మురికినీటి గుంటల్లో వేస్ట్ ఆయిల్ బాల్స్ వేయించారు.

చెంతనే నీరున్నా తీరని తాగునీటి చింత



వేంపల్లె పాపాఘ్ని నదిలో నీరు లేక వదిలేసిన పంచాయతీ ఫిల్టర్లు



వృథాగా ఉన్న నీళ్ల ట్యాంకు

వేంపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చెంతనే పాపాఘ్నినది ఉంది. అక్కడి నుంచి చుట్టుపక్కల గ్రామాలకు ప్రత్యేక నీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కానీ ఆ నీరు చెంతనే ఉన్న వేంపల్లెకు అందడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు పాపాఘ్ని నీటిని సరఫరా చేయాలన్న ఆలోచనే మరచిపోయినట్టున్నారు. పాపాఘ్ని నదిలో భూగర్భజలం అడుగంటడంతో తాగునీటి సరఫరా ఆపేశారు. సుమారు 8 నెలలకు పైగా నీరు రావడం లేదు. పట్టణంలో వేసిన బోర్ల ద్వారానే కొళాయిలకు నీటిని అందిస్తున్నారు. పా పాఘ్ని నుంచి తాగునీరు కావాలని ప లుమార్లు పంచాయతీ అధికారులను అడిగినా పట్టించుకోలేదు. వేంపల్లె పట్టణంలోని పాతపేట, గౌరీనగర్, మెయిన్‌బజార్, గాండ్ల వీధి తదితర ప్రాంతాలకు పాపాఘ్ని నదిని అందించేందుకు పాతహాల్ వద్ద ఉపరితల భూజలాశయాన్ని నిర్మించారు. అక్కడికి పాపాఘ్ని నది నుంచి ఫిల్టర్ల ద్వారా ప్రత్యేక పైప్‌లైన్‌తో నీటిని సరఫరా చేసి స్థానిక ప్రజలకు అందించేవారు. 20 నుంచి 30 అడుగుల లోతులో ఉన్న ఫిల్టర్లలో భూగర్భజలం అడుగంటిపోయి నీళ్లు రావడం లేదు. దీంతో పట్టణంలో ఉన్న బోరునీరు ప్రజలకు అందిస్తున్నారు. పాపాఘ్ని నుంచి మంచి నీళ్లు సరఫరా చేయాలని కొద్ది నెలలుగా విన్నవిస్తున్నా అధికారులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పాపాఘ్ని నదిలో కొత్త ఫిల్టర్లను గానీ, ఉన్న ఫిల్టర్లలో మరింత లోతుకు వేసిగానీ నీటి సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఈఓ ఏమన్నారంటే...

పాపాఘ్ని నీరు అక్కడికి వారికి అందడం లేదన్న విషయం ఈఓ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ లైన్, ఇతర సమస్యల వల్ల నీరు పాపాఘ్ని నది నుంచి ఇవ్వలేకపోతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఫిల్టర్లలో మరింత లోతుకు వేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పశువుల సంరక్షణకు సర్వే

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణకు ప్రణాళికలు రూపొందించేందుకు ప్రభుత్వ పశుగణాంకాల సర్వే నిర్వహించనున్నట్లు పులివెందుల డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.మంగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి 21వ పశుగణాంకాల సర్వే పులివెందుల నియోజకవర్గంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఇళ్ల వద్దకువచ్చే పశుసంవర్ధక శాఖ సిబ్బందికి పశువుల యజమానులు పశువులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు అలాగేపశుసంవర్ధక శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడుతున్నామన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఈ కార్యక్రమం చేపడుతారని తెలిపారు. వీటి ఆధారంగా ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పథకాలు రూపొందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

పూలే విగ్రహ పనులు త్వరగా పూర్తి చేయాలి



కమిషనరుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటరు పాకా సురేశ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జ్యోతిరావుపూలే విగ్రహ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్లు పాకాసురేశ్, షంషీర్, బాలస్వామిరెడ్డి కోరారు. గురువారం కార్పొరేషన్ కమిషనరు చాంబరులో కమిషనరును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బిల్డప్ సర్కిల్‌లో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న బస్‌షెల్టరును తొలగించాల న్నారు. దేవునికడప రోడ్డు మార్కెట్లో ఉన్న రోడ్డు సర్కిల్ పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో తాగునీటి, శానిటేషన్ సమస్యలు ఉన్నాయని, వీటిని కూడా పరిష్కరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలి: ఏఐఎస్‌ఎఫ్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడారు.

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం గంగవరం పంచాయితీలో దెబ్బతిన్న వరి పొలాలను అగ్రికల్చర్ అధికారులు, స్థానిక రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు త్వరగా నష్ట అంచనా వేసి నివేదిక పంపాలని ఆదేశించారు. అలాగే కాల్వ పూడికలను త్వరగా తీయించాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, వాసుదేవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. గురువారం కమలాపురం నగర పంచాయతీలో వాటర్ పైపులైను పనులను ప్రారంభించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మేరీ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కమలాపురం నగర పంచాయతీ ప్రజల నీటికష్టాలను తొలగిస్తామన్నారు. రాంనగర్‌లో 15వ ఫైనాన్స్ మొదటి కోటా నిధుల ద్వారా రూ.14 లక్షలతో తలపెట్టిన మంచినీటి వాటర్ పైపులైను పనులను ప్రారంభించారు. కమలాపురం నగర పంచాయతీ కమిషనరు జగన్నాథం, వైస్‌చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, నగర పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భూ-రీసర్వే గ్రామ సభలో 68 ఫిర్యాదులు

సింహాద్రిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమకుంట్ల గ్రామంలో జరిగిన భూ-రీసర్వే గ్రామ సభలో 68 మంది రైతులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఒక్క రెవెన్యూ గ్రామంలోనే 68 మంది రైతులకు అన్యాయం జరిగినట్లు గ్రామ సభలో ఫిర్యాదుల ద్వారా తేలింది. ఫిర్యాదు చేసిన వారిలో అధిక శాతం సొంత భూమిని కోల్పోయిన రైతులే ఉండటం విశేషం. మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ హరిబాబు, వీఆర్వో నిరంజన్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలి: ఎస్టీయూ



వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర అకౌంట్స్ జనరల్ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సంయుక్తగా నిర్వహించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంటెంట్ జనరల్‌కు ఎస్టీయూ నేతలు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో వివిధ మండలాల ఎంఈఓలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం 2018 జూలై 2019 జనవరి డీఏలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసి రెండు డీఏలను ఆరు విడతలుగా 2021 సంవత్సరంలో బిల్లులు చేసుకోవాలని ఇచ్చిందన్నారు. ఈ ఆరు బిల్లులను పాత పెన్షన్ వారికి పీఎఫ్ ఖాతాలకు నూతన పెన్షన్ విధానంలో ఉన్న వారికి 10 శాతం మినహాయించి మిగిలిన 90 శాతం క్యాష్‌రూపంలో ఇచ్చే ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 30 శాతం మందికి జమ కాలేదన్నారు. తక్షణం జమ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, సీనియర్ నాయకులు జయరామయ్య, సాదిక్ పాల్గొన్నారు.

విద్యార్థుల మెనూలో తేడాలుండరాదు: ఎంపీడీఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

చెన్నూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి తేడాలుండకూడదని, మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలిసి భోంచేశారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

మూమెంటు రిజిస్టరు కచ్చితంగా ఫాలో కావాలి

సచివాలయ సిబ్బంది మూమెంటు రిజిస్టరు కచ్చితంగా ఫాలో కావాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అన్నారు. శివాలపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుదర్శనరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగు కేసులను త్వరితగతిన పూర్తి చేయండి: డీఎస్పీ



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌లో ఉన్న పెండింగు కేసులన్నీ త్వరగా పూర్తి చేయాలని, రాత్రులు గస్తీని ముమ్మరం చేయాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేసులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. రాత్రిళ్లు అనుమానంగా తిరిగే వారిని పూర్తిస్థాయిలో విచారించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలని, అలాగే పాత నేరస్థుల కదలికలపై కూడా ఎప్పటికప్పుడు ఆరాతీస్తూ ఉండాలని ఆదేశించారు.

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించండి




వినతిపత్రం అందిస్తున్న తూగుట్ల మధుసూదనరెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, రాష్ట్రీయ శివాజీ సేన కడప జిల్లా అధ్యక్షుడు కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాముడికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల మురుగునీరంతా ఆలయంలోకి ప్రవేశించి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిధులు రావడం లేట్ అయితే తన సొంత నిధిని కేటాయిస్తానని, వెంటనే డ్రైనేజీ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కమిషనర్‌కు తెలిపారు. రెండు రోజుల్లో పనులు మొదలు పెట్టి డ్రైనేజీ సమస్యకు శాశ్వతంగా పరిష్కరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, హిందూ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక డంపులపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిందని, కొందరు ట్రాక్టర్ యాజమానులు పక్కదారిపట్టించి ఇసుక డంపులు ఏర్పాటు చేసుకుంటున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవలాని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ పేర్కొన్నారు. వేంపల్లెలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాపాఘ్ని నదిలో ఇసుకను రాత్రింబవళ్లు ట్రాక్టర్లతో తరలించుకుంటున్నారని, తాగునీటి బోర్లు ఉన్న ప్రాంతానికి వెళ్లి ఇసుకను తోలడం వల్ల భవిష్యత్తులో భూగర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ఉచితంగా ఇసుక దొరుకుతుండటం వల్ల ఇంటి పునాదులకు తోలుకుంటున్నారని రైతులు నదిలో నుంచే పొలాలకు ఇసుక తోలుకుంటున్నారని, వాగులు, వంకల్లో తోలుకోవాలని సలహా ఇచ్చారు. పగలు మాత్రమే ఇసుకను తరలించుకునేలా నిర్దిష్ట గడువును విధించాలని అధికారులను ఆయన కోరారు. జిల్లా మాజీ కార్యదర్శి పీవీ రమణ, మైనార్టీ టీడీపీ నాయకులు ఫయాజ్, మహబూబ్ షరీఫ్, మదార్, ఇలియాస్, లాడెన్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలువకు మరమ్మతులు



కాలువ పూడిక తీయిస్తున్న ఇరిగేషన్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు

సీకేదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక డ్యాం నుంచి రెడ్డిచెరువుకు నీరు అందించే కాలువ పూడిపోయి చెరువుకు నీరు రాకపోవడంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డికి స్థానికులు తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన వారు ఇరిగేషన్ డీఈకి సమస్యను తెలియజేయడంతో ఆయన ఆదేశాలతో ఏఈ జగదీశ్వర్‌రెడ్డి గురువారం బుగ్గవంక నుంచి రెడ్డిచెరువుకు నీరు అందించే కాలువ పూడికలు జేసీబీ సాయంతో పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హోం లోన్ మేళాను వినియోగించుకోండి

● రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిశోర్‌కుమార్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నేక్నాం కళాక్షేత్రంలో నిర్వహించే ఎస్‌బీఐ హోంలోన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు శ్రీవాణి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆ యన విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత రుణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యకిగత రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు కూడా వ్యక్తిగత లోను ఇస్తామన్నారు. వాహన రుణాలు, గృహ రుణాలు, ఇంటి నిర్మాణానికి హోంలోను, స్థలం లేదా ఇల్లు కొనుగోలుకు గృహ రుణం మంజూరు చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రిపుల్‌ఐటీ ఆధ్వర్యంలో ల్యాబ్ నిర్వహణ



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త

చక్రాయపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ కళాశాల యాజమాన్యం మూడు సంవత్సరాల కాలపరిమితితో పాఠశాలలో ల్యాబ్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు తెలిపారు. గురువారం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హరినాథ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు సత్యానంద, విజయకుమార్, ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు రవి, మణికిరణ్, భాస్కరయ్య, డాక్టర్ సువర్ణ, ఎస్.లిడియా,హేమచంద్ర, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి అంగడి వీధి విద్యార్థులు


సికెదిన్నె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి జిల్లా పరిషత్ విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు అగ్గిరప్ప తెలిపారు. అండర్-14 క్రికెట్‌లో మోక్షజ్ఞగౌడ్ నవంబరులో అమలాపురంలో 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారని, అలాగే అండర్-14 ఖోఖోలో యువరాజ్, బాలికల్లో మరియం రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

బేడ బుడగజంగాలకు సత్వరమే న్యాయం చేయాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగజంగాలకు సత్వరమే న్యాయం చేయాలని బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధూపం రాజు కోరారు. గురువారం ద్వారకానగర్‌లో ఎమ్మెల్యే మాధవీని కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర షెడ్యూల్డ్ కులాల జాబితాలో తమ కులం కూడా ఉందన్నారు. 2002లో వెలువడిన రాష్ట్రపతి ఉత్తర్వులలో తమ కులాన్ని కేవలం తెలంగాణ ప్రాంతానికే పరిమితం చేశారన్నారు. హక్కులను కోల్పోయి దీనావస్థలో బతుకున్నామని, న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.



రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడండి



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం గురురాజ్


పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని పలువురు ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులను కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య స మావేశం నిర్వహించారు. రెవెన్యూ, వె లుగు, ఫారెస్ట్, విద్యుత్, ఐసీడీఎస్, వ్యవసాయ, ఉపాధి, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, విద్య తదితర శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించి ప్రస్తుతం జరిగే కార్యక్రమాలను వివరించారు. ఆర్.తుమ్మలపల్లె వద్ద కొన్నేళ్లుగా అంగన్వాడీ కేంద్రం వద్ద మురుగునీరు నిల్వ ఉంటోందని, స్థానికులకు చెప్పినప్పటికి పెడచెవిన పెడుతున్నారన్నారు. దీనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీటీసీ సభ్యులు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్.తుమ్మలపల్లెలో పొలాలకు వెళ్లే దారికి ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని కోరారు. వెలుగు ఏపీఎం గురురాజ్, సీఐ జీవన్‌గంగనాథ్, ఏఓ నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని తదితరులు పాల్గొన్నారు.

బైక్ రైడర్‌కు ఎస్ఐ కౌన్సెలింగ్

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కడప పాతబస్టాండు వద్ద బైక్ తోలుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్న యువకుడికి వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కడపకు చెందిన మహ్మద్ గౌస్ గురువారం ద్విచక్ర వాహనం నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. అతనికి డ్రైవింగ్ లైసెన్సు కూడా లేకపోవడంతో జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

● సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన బీటెక్ రవి



చెక్కులు అందిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం సహాయనిధి చేయూతనందిస్తుందన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో అనారోగ్యంతో ఇబ్బంది పడిన వారికి దాదాపు 25 మందికి రూ.13లక్షల చెక్కులను అందించారు.

'ఉద్యోగం ఇప్పించి న్యాయం చేశారు'

వేంపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీపై కక్ష సాధింపులో భాగంగా రైతు సాధికారల సంస్థ యూనిట్‌లో ఎల్-2 యూనిట్ మేనేజర్‌గా పనిచేస్తున్న తుపాకుల గంగిరెడ్డిని తొలగించారని, మళ్లీ ఆయనకు టీడీపీ ప్రభుత్వంలో ఉద్యోగం ఇప్పించి న్యాయం చేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపల్లె రామగంగిరెడ్డి పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడి ఉద్యోగం ఇప్పిచడం పట్ల సంతోషం వెలిబుచ్చారు. అలాగే నందిపల్లెకు చెందిన జయరామిరెడ్డికి కూడా రూ.లక్ష సీఎం సహాయ నిధిని అందించారన్నారు.

టీడీసీ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ గంగయ్య



డాక్టర్ గంగయ్యకు నియామక పత్రం అందిస్తున్న వీసీ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు అసోసియేట్ ప్రొఫెసరు గంగయ్యను కాలేజీ డెవలప్‌మెంటు కౌన్సిల్ అసోసియట్ డీన్‌గా నియమించారు. గురువారం వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ నియామక ఉత్తర్వులను అందించారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లోని సహాయ పరీక్షల నియంత్రణ సహాయ అధికారి బాధ్యతల నుంచి ఆయనను రిలీవ్ చేశారు.

కంపచెట్ల తొలగింపు

కలసపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు మలుపులతో ఇరుపక్కలా ఉన్న కంపచెట్లను గురువారం తొలగించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులు, కలసపాడు సబ్ ఇన్‌స్పెక్టరు చిరంజీవి తెలిపారు.కలసపాడునుంచిగంగయ్యపల్లె వరకు చెట్లను తొలగించినట్లు తెలిపారు.

'వెంచర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీలో వెంచర్ నిర్వాహకుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ గురువారం ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలో రియల్ ఎస్టేట్ వెంచర్ నిర్వాహకులు కాలువలు ఆక్రమించి వెంచర్లు నిర్మిస్తున్నారని, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు కట్టడంలేదని వెంచర్లకు అనుమతులు లేవన్నారు. సామాజిక అవసరాలకోసం 10 శాతం స్థలాన్ని కూడా వదలడంలేదని తెలిపారు. నీలాపురం రోడ్డులో వెంచర్‌కు అనుమతి లేదని, ఖాదర్‌బాద్ వెనుకవైపు వెంచర్ నిర్వాహకులు కాలువను ఆక్రమించి రోడ్డు నిర్మించారన్నారు. నిర్వాహకులు వేస్ట్‌వాటర్‌ను కాలువలోకి వదులుతున్నారని ఆనీరంతా ఖాదర్‌బాద్‌లోకి వస్తోందని పేర్కొన్నారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయం వెనుక ఆటోనగర్‌వద్ద, మండీ మర్చంట్‌రోడ్డులో, శ్రీచైతన్య స్కూల్ వద్ద కాలువలను పూడ్చి సీసీ రోడ్డు నిర్మించారని తెలిపారు. కొత్తపల్లె పంచాయతీలో కాలువలను పూడ్చి వెంచర్లు వేయడం వలన రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఈ వెంచర్లపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు మండల సర్వసభ్యసమావేశం

ముద్దనూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు.సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మెప్మా అర్బన్ మార్కెట్‌ను పరిశీలించిన టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ శివమ్మ సూచించారు. గురువారం జమ్మలమడుగులోని పాత బస్టాండులో మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఛైర్‌పర్సన్ శివమ్మ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది జ్యోతి, భాస్కర్, రమణారెడ్డి, ఆర్పీలు, టీడీపీ నాయకులు కొండాపురం గోపీనాథరెడ్డి, పొన్నతోట శ్రీను, సయ్యద్, నాగరాజు, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి

ఎర్రగుంట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీకి భూములిచ్చిన వారికి ఉద్యోగాలివ్వాలని భూనిర్వాసితులు కోరారు. భూ నిర్వాసితుల సమావేశం గురువారం ఆర్టీపీపీలో నిర్వహించి అనంతరం సీఈ గౌరీపతికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆర్టీపీపీ నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి 50శాతం ఉద్యోగాలిస్తామని జీవో 98లో స్పష్టంగా ఉందన్నారు. ఆర్టీపీపీలో జేపిఏ పోస్టులు సుమారు 300వరకు ఖాళీగా ఉన్నాయని వాటికి వెంటనే నోటిఫికేషన్ వదలాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు పి.శివయ్య, గంగాసురేష్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన సదస్సు

బి.కోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలపై గురువారం ఏపీవో రాజాసాహెబ్, ఈసీ ఖాజా, ఉపాధి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఇంకుడు గుంతలు ఒక్కో దానికి రూ.6వేలు ఇస్తుందని ఇవి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిపైన పడ్డ వర్షం నీరు భూమిలోకి ఇంకేందుకు ప్రతి ఇంటి ఆవరణంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇంకుడు గుంత తవ్వుకోవడానికి జాబ్‌కార్డు కలిగి ఉన్నవారంతా అర్హులేనని వారు తెలిపారు. ఈ సమావేశానికి జాతీయ ఉపాధి హామీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు

అట్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలో రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు శిరీష తెలిపారు. గురువారం కుంభగిరి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో జరిగిన భూ సమస్యలపై భూయజమానులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయరు మురళీక్రిష్ణ, కడప డీఐఏ బాలాజీ, బద్వేలు డీఐఏ రఘురామయ్య, మండల సర్వేయరు వేణు, ఆర్ఐ రమణ, వీఆర్వో సచివఆలయ సర్వేయరు అశోక్, రైతులు పాల్గొన్నారు.

పురపాలక అభివృద్ధికి సహకరించండి : మున్సిపల్ కమిషనర్

బద్వేలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)ః పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి, నీటి , తదితర పన్నులు సకాలంలో మున్సిపాలిటీకి చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పలువురు బకాయిదారులతో నేరుగా మాట్లాడుతూ నీటి మరియు కళాయి పన్నులు అత్యధికంగా 100 మంది పేర్లు ఉన్నాయని ఆ పేర్లను సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు సుమారు ఒక కోటి అరవై లక్షలు పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి,పశుపోషణను లాభదాయకంగా మార్చాలి



ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా పాడి, పశుపోషనపై ఎక్కువగా ఆధారపడి ఉన్నందున దానిని లాభదాయకంగా మార్చాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా పలువురు శాస్త్రవేత్తలు పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పశువుల యాజమాన్య పద్ధతులకు ఏఐ టెక్నాలజీ ద్వారా మెరుగుపరచడానికి కృషి చేయాలన్నారు. అధిక పాల దిగుబడి, మాంసం, గుడ్లు, ఎక్కువ ఉత్పత్తి చేసేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించాలని సూచించారు. అసిస్టెంట్ రీప్రొడెక్టివ్ టెక్నాలజీ ద్వారా ఉత్పాదక శక్తిని పశువులలో పెంచడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాలను సమర్పించిన శాస్త్రవేత్తలకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, పశువైద్య కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరానికి విశేష స్పందన

పోరుమామిళ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకూరుపేట పశువైద్యశాల పరిధిలో కొండుగారిపల్లె గ్రామంలో పాడిపశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. గురువారం పశువైద్యాధికారి శివశ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి కడప డివిజను ఉప సంచాలకుడు డాక్టర్ జీవీ రమణయ్య, సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, పోరుమామిళ్ల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు చంద్రశేఖర్, కలసపాడు పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొని పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డయాబెటీస్ రోగులకు పుట్టగొడుగులు మంచి ఆహారం

మైదుకూరు రూరల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డయాబెటీస్,హృదయ సంబంధమైన రోగాలకు పుట్టగొడుగులు చక్కటి ఆహారమని బయోటెక్నాలజీ ప్రొఫెసర్ చంద్రమతి శంకర్ తెలియచేశారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో పుట్టగొడుగులపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ శిక్షణాకార్యక్రమంలో పుట్టగొడుగులను ఏలా పెంచాలి వాటి వలన ఉపయోగాలు, కుటీర పరిశ్రమ ద్వారా వచ్చే లాభాలు వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డి,సుబాన్‌సాహెబ్, మధుసూదన్‌రెడ్డి, సునీల్‌కుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలియోపై అధికారుల ర్యాలీ

చాపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులో గురువారం ప్రపంచ పోలియో నిర్మూలన దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఓబులేసు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ 0-5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న బిడ్డలకు వారి తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలన్నారు. సీహెచ్‌వో మహదేవ్‌యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, పద్మావతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడాలి

ప్రొద్దుటూరు అక్టోబరు 24 : మహిళలకు జీవించే హక్కును కాపాడేలా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం జేవీవీ కార్యాలయంలో మహిళా సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ హైస్కూలు నుంచి కాలేజీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు,వీధి సమావే శాలు పెట్టి అవగాహన కల్పించాలని నిర్ణయించారు.ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు భారతి, సమతా అధ్యక్షురాలు ఉషారాణి, జేవీవీ ప్రతినిధి సునీత, విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మీ, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థిశక్తి హరిత,రెహానా హసీనా,పద్మ, రుక్సానా పాల్గొన్నారు.

'జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు దారుణం'

బద్వేలుటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బద్వేలులో మృతి చెందిన ఇంటర్‌విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ఆయన ప్రభుత్వంపై మాట్లాడిన మాటలు చాలా దారుణమని టీడీపీ నియోజకవర్గసమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్న అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఘటన జరిగిన గంటకే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారన్నారు. ప్రభుత్వం తరుపున 10లక్షల రూపాయలు ఆర్థికసహాయాన్ని అందించారని. అంతేగాకుండా బిజివేముల వీరారెడ్డిట్రస్ట్ తరుపున లక్షరూపాయలు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు లక్షరూపాయలు అందించామన్నారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, బిగ్‌బాస్, రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, జగదీశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయరామిరెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితేష్‌కుమార్‌రెడ్డి

పాఠశాలకు రహదారి ఏర్పాటు చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నడింపల్లె మున్సిపల్ హైస్కూలులో నాడు-నేడు పనుల కింద చేపట్టిన తరగతి గదులకు వెళ్లడానికి దారి సౌకర్యం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన మూడు తరగతి గదుల నుంచి అదనపు తరగతి గదులకు ఆనంద నిలయం హాస్టల్‌లో నుంచి వెళ్లడానికి గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్, మాజీ కౌన్సిలర్ జయలింగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.